సాక్షి
మెదక్
సోమవారం । 11 । మార్చి । 2024

రమణీయం.. రథోత్సవం

- ఏడుపాయలలో భక్తుల సందడి
- అపూర్వ ఘట్టాన్ని తిలకించి పరవశం



రథోత్సవంలో భక్తుల కోలాహలం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరలో చివరి అంకమైన రథోత్సవం ఆదివారం రాత్రి వైభవోపేతంగా సాగింది. ధర్మకర్త రాగి చక్రపాణి దాతృత్వంతో ఈ ఏడాది కొత్త రథాన్ని తయారు చేయించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలు, కొబ్బరి మట్టలు, అరటి కొమ్మలు, దేవతామూర్తుల చిత్రపటాలతో అందంగా అలంకరించారు. ఆచారం ప్రకారం ఏడుపాయల పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి నాగ్సాన్‌పల్లి సాయిరెడ్డి ఇంటికి వెళ్లి రథోత్సవ ఆహ్వానం పలికారు. సాయంత్రం నాగ్సాన్‌పల్లికి చెందిన 18 కులాలకు చెందిన పని బాటలవారు రథం ముందు పట్టుపరిచి, గుమ్మడి కాయలు, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు గర్భగుడిలో ఉన్న దుర్గమ్మ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీపై రథం వద్దకు తీసుకువచ్చి ఆసీనం చేయగా భక్తులు రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. దుర్గానామ స్మరణతో ఏడుపాయల్లోని కొండా కోనలు ప్రతిధ్వనించాయి. మెదక్ డీఎస్పీ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఉత్సవం ముగిసింది.

నలుదిక్కులు.. అమ్మకు మొక్కులు

యాంత్రిక యుగంలో అనుక్షణం తీరిక లేకుండా గడిపే పట్టణ వాసులు వేలాది మంది ఏడుపాయలకు బంధు వర్గాలతో వచ్చి మూడు రోజుల పాటు అటవీ ప్రదేశంలో తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపారులు తమ లాభంలో కొంత భాగాన్ని ఏడుపాయల జాతర కోసం పక్కన పెట్టి శివరాత్రి రోజు శివదీక్ష పూని ఒక్క పొద్దులతో గడిపారు. బండ్లు తిరిగే రోజు నుంచి రెండు రోజుల పాటు బోనాలు తీసి విందు చేసుకున్నారు. కొండా కోనల పక్కన ఏడుపాయలుగా చీలి ప్రవహించే మంజీరా గలగలలు, దట్టమైన అటవీ ప్రాంతం మధ్య ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ భక్తులు ఆనందంగా గడిపారు.

ఆకట్టుకున్న కళాకారులు

ఏడుపాయలలో ఆదివారం తెల్లవారుజాము వరకు బిత్తిరి సత్తి, కళాకారులు సందడి చేశారు. పాటలు, కామెడీతో వేలాది భక్తులను కడుపుబ్బ నవ్వించారు. జానపద గేయాలు నృత్యాలతో ఉర్రూతలూగించారు. జోగిని శ్యామల, రాధిక, పావని బోనాలు తీసి చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



బోనమెత్తిన జోగిని శ్యామల



దుర్గమ్మ సన్నిధిలో భక్తులు



నెత్తిన బోనాలతో భక్తులు



ఆలయం ఎదుట సందడి

14 నెలలు.. 406 కేసులు

- 'ఆమె'పై ఆగని అఘాయిత్యాలు
- అత్యధికంగా వరకట్న వేధింపులు
- రెండో స్థానంలో ఈవ్‌టీజింగ్ కేసులు



మెదక్: మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదు. రేప్ కేసులు, వరకట్న వేధింపులు, ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో అమ్మాయిలపై దాడులు.. ఇలా అనేక రకాల కేసులు నమోదవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 14 నెలల్లో 406 కేసులు నమోదు కాగా వాటిలో వరకట్న వేధింపులు అత్యధికంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. రెండో స్థానంలో ఈవ్‌టీజింగ్ కేసులు ఉన్నాయి.

జిల్లావ్యాప్తంగా 2023 జనవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు మొత్తం 406 కేసులు నమోదయ్యాయి. వీటిలో నూటికి 90 శాతం కేసులు మద్యం మత్తులో జరిగినట్లు ఉన్నతాధికారులు నిర్ధారించారు. గృహహింస చట్టం, షీటీమ్స్, భరోసా సెంటర్, పోక్సో, సఖీ కేంద్రాల ఏర్పాటుతో పాటు అనేక చట్టాలు మహిళలకు భరోసా ఇవ్వడం లేదు. మెదక్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై గతేడాది 10వ తరగతి చదువుతున్న కూతురిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాలిక తల్లికి సైతం జరిగిన విషయం చెప్పలేకపోయింది. బాలిక గర్భం దాల్చి కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అసలు విషయం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మానవ మృగాన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

అవగాహన కల్పిస్తున్నా మారని..

బాల్య వివాహాల నుంచి మొదలుకుని వరకట్న వేధింపుల నివారణ, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై ప్రజలకు కళా బృందాలతో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా అన్యాయానికి గురైనా మహిళల కోసం భరోసా కేంద్రం ద్వారా న్యాయ సహాయం అందిస్తున్నారు. మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. న్యాయస్థానంలో నేరస్తులకు 60 శాతానికి పైగా శిక్ష పడేలా చేస్తున్నా అఘాయిత్యాలు ఆగడం లేదు. మహిళలపై జరిగే దాడులకు మద్యమే ప్రధాన కారణమని పోలీస్ అధికారులు చెబుతున్నారు. కౌమరదశలో ఉన్న బాలికల తల్లిదండ్రులు వారి పిల్లలపై దృష్టి పెట్టకపోవడంతో ప్రేమ పేరుతో మోసపోతున్నారని పేర్కొంటున్నారు.

హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా..

- ప్రజల్లోకి వెళ్లేందుకు బీబీ పాటిల్ యత్నాలు
- పార్టీ టికెట్ ఆశావహులతో సంప్రదింపులు
- బీజేపీ క్యాడర్‌తో మమేకమయ్యేందుకు కార్యాచరణ



బీబీ పాటిల్

జహీరాబాద్: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన మరుసటి రోజే అనూహ్యంగా జహీరాబాద్ ఎంపీ టికెట్ దక్కించుకున్న సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రజల దగ్గరకు వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. అంతే కాకుండా పార్టీ క్యాడర్‌తో మమేకమై ప్రచారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన పలువురు నేతలను కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే శాస్త్రవేత్త, బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డిని కలిసి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మాజీ ఎంపీ దివంగత ఎం.బాగారెడ్డి కుమారుడు ఎం.జైపాల్‌రెడ్డిని ఫోన్‌ద్వారా సంప్రదించే ప్రయత్నం చేసినా అందుబాటులోకి రాలేదని సమాచారం. జైపాల్‌రెడ్డి టికెట్‌ను గట్టిగా ఆశించారు. అతను చివరి వరకు పోటీలో ఉన్నా అనూహ్యంగా బీబీ పాటిల్‌కు టికెట్ కేటాయించడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. బీబీ పాటిల్ తనతో ఉన్న క్యాడర్‌ను బీజేపీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పాటిల్ 2014 సార్వత్రిక ఎన్నికల ముందు వరకు పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు పెద్దగా తెలియని వ్యక్తి. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయినా ఈయన మహారాష్ట్రలో నిర్మాణ రంగంతో పాటు వివిధ వ్యాపారాలు చేసుకునేవారు. అప్పట్లో పాటిల్ బీజేపీ టికెట్‌ను ఆశించినా దక్కలేదు. తర్వాత పలు కారణాల వల్ల బీఆర్‌ఎస్ ఆవిర్భవించినప్పుడు ఆ పార్టీలో చేరి జహీరాబాద్ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. 1.44లక్షల మెజార్టీతో గెలిచి తొలిసారి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. అనంతరం పార్లమెంట్ పరిధిలోని తన పార్టీ ఎమ్మెల్యేలతో కొంత గ్యాప్ పెరిగింది. అయినా రాష్ట్ర నాయకత్వంతో సన్నిహిత సంబంధాలుండడం వల్ల 2019 ఎన్నికల్లోనూ టికెట్ దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఓటమి అంచువరకు వెళ్లి 6,229 మెజార్టీతో బయట పడ్డారు. ఎమ్మెల్యేలు సహకరించడం లేదని ఆయన పలుమార్లు అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తపరిచారు. అధికారిక కార్యక్రమాల్లో, సీఎం, మంత్రుల సభల్లో మాత్రమే పాల్గొంటూ వచ్చారు. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి తన పార్లమెంట్ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తూ వచ్చారు. ఇటీవల ప్రధాని మోదీ చేతుల మీదుగా రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు విజయ్ రామ్

దుబ్బాక: గో ఆధారిత వ్యవసాయంతో ఎన్నో ఉపయోగాలున్నాయని, ప్రకృతి వ్యవసాయం చేయడంతో రైతులు అనేక లాభాలు పొందవచ్చని సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్ రామ్ అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంలో బాలాజీ దేవాలయంలో సురభి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు గో ఆధారిత వ్యవసాయం, ఐదు అంచెల ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు వరి చేలల్లో వేసే అంతర పంటల వలన కలిగే లాభాల గురించి వివరించారు. జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు చేసి చూపించారు. గోవుల పెంపకం వలన రైతులకు కలిగే ఆరోగ్య , ఆర్థిక లాభాల గురించి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరి చేలల్లో రసాయన ఎరువుల వాడకం వలన రానున్న భవిష్యత్ తరాలు భయానకంగా ఉండబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ చేయడం వలన భూమి సారవంతంగా మారడమే కాకుండా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన రాజమౌళి గుప్తా రైతులకు దాదాపు 200కు పైగా ఆవులను ఉచితంగా పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. అనంతరం బాలాజీ ఆలయ బాధ్యుడు రాజు మాట్లాడుతూ..త్వరలోనే దుబ్బాక బాలాజీ ఆలయం తరుపున ప్రతీ ఏటా దాదాపు 30 మంది రైతులకు ఉచితంగా ఆవులను పంపిణీ చేసే కార్యక్రమం చేపడుతామన్నారు. 20 ఎకరాల పైగా మునగా తోట పెట్టి మంచి లాభాలను పొందుతున్న రైతు వెంకటేశ్వర్లకు చింత రాజు రూ.10 వేల నగదు బహుమతి అందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బాలాజీ దేవాలయ చైర్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు విజయ్ రామ్

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు షురూ

రామాయంపేట(మెదక్): రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలను ఆదివారం రామాయంపేటలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు ప్రారంభించారు. పలు జిల్లాలకు చెందిన 100 మందికి పైగా క్రీడాకారులు పోటీకు హాజరయ్యారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి ఈనెల 29న బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు



కలెక్టరేట్ ఎదుట పచ్చదనం

హరితం.. ఆహ్లాదం

కలెక్టరేట్ ఆవరణ పచ్చదనం పరుచుకుంది. వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదం పంచుతున్నాయి. డివైడర్లపై పెరిగిన గడ్డి మొక్కలు, పూలు పరిసరాలకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. మండుటెండలో వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు చల్లని గాలిని అందిస్తున్నాయి.

– మెదక్ కలెక్టరేట్



ఏపుగా పెరిగిన మొక్కలు



ఆకట్టుకుంటున్న పూలు

న్యూస్‌రీల్

ప్రత్యేక బలగాల కవాతు



పట్టణంలో పోలీసుల కవాతు

తూప్రాన్: త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో పట్టణ కేంద్రంలో ఆదివారం పోలీసు ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. ఈసందర్భంగా డీఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పార్టీల పేరుతో ఘర్షణలకు పాల్పడొద్దన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టకూడదని.. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివానందం, పోలీసులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ ఎస్సీ కాలనీలో ఆదివారం ఖాళీ బిందెలతో కాలనీ మహిళలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారుల పాలనలో తమ సమస్యను పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. మూడు నెలలుగా నీరు లేక వ్యవసాయ పొలాల నుంచి తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ బోరుకు మరమ్మతులు చేయడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆల్ ఇండియా నెట్‌బాల్ పోటీలకు నిఖిల్



నిఖిల్‌ను అభినందిస్తున్న పీఈటీ గోవర్ధన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ఆల్ ఇండియా నెట్‌బాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన క్రీడాకారుడు నిఖిల్ ఎంపికైనట్లు పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ లయోలా కళాశాలలో బీఎస్సీ చదువుతున్న నిఖిల్ ఈ నెల 5న ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన నెట్‌బాల్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను చాటి ఆల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 12 నుంచి 15వరకు కర్ణాటకలో జరుగనున్న ఈ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. క్రీడాకారుడు నిఖిల్ పోటీల్లో రాణించి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకు రావాలని పలువురు ఆకాంక్షించారు.

వైభవంగా వసంతోత్సవం



పుష్కరిణిలో విగ్రహాలకు పూజలు

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి మహోత్సవంలో బీరంగూడ గుట్టపై ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ శశిధర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యులు, అర్చకులు పాల్గొని దేవతల విగ్రహాలను పల్లకీపై ఊరేగించారు. అనంతరం స్థానిక గుండంలో స్నానాలు చేయించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పటాన్‌చెరు టౌన్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల హక్కులను కాలరాసిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు పీఆర్సీ ప్రకటించడంతో ఆదివారం పట్టణ బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్టీసీని భూస్థాపితం చేయడానికి ప్రయత్నించిందని మండిపడ్డారు.

క్లుప్తంగా

డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి జ్యోతిష్య శిరోమణి అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యులు, డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి జ్యోతిష్య శిరోమణి అవార్డు దక్కింది. రాష్ట్రంలో ఎస్ఎస్ లైఫ్ ఆస్ట్రో సంస్థకు చెందిన వారు జ్యోతిష్యశాస్త్రంలో ప్రముఖ సేవలు అందించిన వారికి ప్రతీ మూడేళ్లకోసారి అవార్డులు అందజేస్తారు. ఈసారి జ్యోతిష్యుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డి తాను చేసిన జ్యోతిష్య సేవలను గుర్తించి ఈ అవార్డును ఇచ్చారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఆదివారం సంస్థ వారు అవార్డు అందజేశారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


బాధితుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని పాములపర్తి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన చాకలి బుచ్చమ్మ రోజువారీలాగే గ్రామంలో ఇస్త్రీ బట్టలు చేస్తుంది. బట్టలు ఇస్త్రీ చేసి మిగిలిన బట్టలు వదిలి రాత్రి కావడంతో నిద్రలోకి వెళ్లింది. అర్ధరాత్రి నాలుగు గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఇంట్లోని దుస్తులు, సామగ్రి దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ పాండుగౌడ్, మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనకయ్యగౌడ్ బాధితులను పరామర్శించారు.

రేషన్ బియ్యం పట్టివేత


ఆటోలో రేషన్ బియ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎలాంటి అనుమతి లేకుండా ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా శనివారం రాత్రి మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగ్గ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆటోను తనిఖీ చేయగా 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయి. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకొని చిన్నకోడూరు పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళ అదృశ్యం


దీప్‌మల్లా (ఫైల్)

మనోహరాబాద్ (తూప్రాన్): మహిళ అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నంకు చెందిన యాసిన్ షేక్ తన భార్య దీప్‌మల్లా సుర్యవంశీతో కలిసి 8 నెలల కిందట మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లికి వచ్చాడు. ఇక్కడే అద్దెకుంటూ స్థానిక పరిశ్రమలో ఉపాధి పొందుతున్నాడు. ఈ నెల 3వ తేదీన యాసిన్ పరిశ్రమలో పనికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చాక భార్య కనిపించలేదు. వెంటనే చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యమైనట్లుగా ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుపై విత్తన భారం

పెరిగిన బీటీ పత్తి విత్తనం ధర

- గతేడాది పోలిస్తే ప్యాకెట్‌పై రూ.11 అధికం
- ప్రస్తుత ధర రూ.864
- 1.5 లక్షల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం
- వరి, కంది, సోయా విత్తనాల సబ్సిడీపై రైతుల ఆశలు


గజ్వేల్‌లోని ఓ దుకాణంలో బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు

గజ్వేల్: వచ్చే వానాకాలం(ఖరీఫ్)లో బీటీ పత్తి విత్తన ధర స్వల్పంగా పెరిగింది. 475 గ్రాముల పరిమాణం కలిగిన బీటీ–2 ప్యాకెట్ గతేడాది రూ.853 ఉండగా... ఈ సారి రూ.864కు పెంచారు. దీని ప్రకారం ఒక్కో ప్యాకెట్‌పై రూ.11 అదనపు చెల్లించాల్సి ఉంటుంది. పెరిగిన ధర ప్రకారం రైతులపై సుమారుగా రూ.45 లక్షలకుపైగా భారం పడనుంది. కంది, సోయా తదితర విత్తనాల ధరలను కొద్ది రోజుల్లోనే ప్రకటించనున్నారు. నాలుగేళ్లుగా విత్తన సబ్సిడీ ఎత్తివేయడంతో రైతులు ఇబ్బంది పడుతుండగా.. కొత్త ప్రభుత్వం సబ్సిడీ వర్తింపజేసుందోమోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో ఏటా వానాకాలంలో వివిధ రకాల పంటలు 5.50 లక్షల ఎకరాలకుపైగా సాగులోకి వస్తుండగా.. ఇందులో పత్తి 1.5 లక్షల ఎకరాల వరకు సాగులోకి రావడం ఆనవాయితీ. కాబట్టి ఈ పంటే కీలకంగా మారుతోంది. జిల్లాలోని రైతులు అత్యధికంగా మొగ్గు చూపే బీటీ–2 విత్తన ప్యాకెట్లు (475 గ్రాముల ప్యాకెట్) సీజన్‌లో 4 లక్షల ప్యాకెట్లు వరకు అవసరముంటాయి. రైతులు ఒక్కో ఎకరాకు రెండున్నర ప్యాకెట్లను విత్తడానికి వాడుతుంటారు. ఈ ప్యాకెట్‌లో 450 గ్రాముల బీటీ, మరో 25 గ్రాముల నాన్ బీటీ విత్తనాలు ఉంటాయి. గతేడాది రూ.853 లభించింది. ఈసారి విత్తన కంపెనీలు ఒక్కో ప్యాకెట్‌పై రూ.11 పెంచగా ప్రస్తుత ధర రూ.864కు చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీని ప్రకారం జిల్లా రైతాంగంపై రూ. 45 లక్షల వరకు భారం పడనుంది.

నిల్వలు తెప్పించడానికి కసరత్తు

జిల్లాలో సుమారు 30కి పైగా కంపెనీలు తమ ఉత్పత్తులను ఇదే ధరకు విక్రయించనున్నాయి. ఇక పోతే బీజీ–1 రకానికి చెందిన విత్తన ప్యాకెట్ల ధరల్లో మార్పులేదు. గతేడాది ఈ విత్తన ప్యాకెట్ ధర రూ.635 ఉండగా...ఈ సీజన్‌లోనూ అదే ధరను కొనసాగించడానికి నిర్ణయించారు. కాకపోతే ఈ విత్తనాలను జిల్లాలోని రైతులు ఎక్కడా కూడా వినియోగించరు కాబట్టి ఈ నిర్ణయం వల్ల రైతులకు పెద్దగా ఉపయోగమేమీ లేదు. ఇకపోతే సీజన్ మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న దృష్ట్యా నిల్వలు తెప్పించడానికి వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది.

వీటికి సబ్సిడీ అమలయ్యేనా?

జిల్లాలో ఈసారి వరి సాగు భారీగా 3.50 లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశముందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇందుకోసం జిల్లాకు వివిధ రకాల వరి విత్తనాలు 60 వేల క్వింటాళ్లకుపైగా అవసరముంటాయి. గతేడాది తెలంగాణ సోనా విత్తనాలు క్వింటాల్‌కు రూ.3,400కు పైగా ఎంటీయూ రకం రూ.3,100కు పైగా ధరకు గతేడాది లభించాయి. వచ్చే వానాకాలంలో ధర ఏ విధంగా ఉండబోతుందో ఎదురుచూడాల్సి ఉంది. కంది ఈసారి 60వేల ఎకరాల్లో సాగులోకి వస్తుందని అంచనా ఉండగా... 3,053 క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరముంటాయి. ఈ విత్తనం ధరపై కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. సోయాబీన్ 120 ఎకరాల్లో సాగులోకి వస్తుందనే అంచనా ఉండగా.. 30 క్వింటాళ్ల విత్తనం అవసరముంది. గతేడాది ఈ విత్తనం కూడా క్వింటాల్‌కు రూ.9,800కు లభించింది. వీటి కొత్త ధరలు కొద్ది రోజుల్లోనే రానున్నాయి. దాదాపుగా పెరుగుదల ఉంటుందనే భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం సబ్సిడీని పునరుద్ధరిస్తే తమకు మేలు జరుగుతుందనే ఆశతో రైతులు ఎదురుచూపుల్లో ఉన్నారు. ఈ అంశంపై జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ వచ్చే వానాకాలం సీజన్‌లో విత్తనాల సరఫరాకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు.

యువత క్రీడలను అలవర్చుకోవాలి


కబడ్డీ ఆడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్
- జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీల సందర్శన

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ యువత క్రీడలను అలవర్చుకోవాలని, క్రీడా స్ఫూర్తి ఐక్యతను ప్రోత్సహిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం పోతారం(ఎస్) లో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీలను సందర్శించి క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. నేను కూడా చిన్నతనంలో కబడ్డీ మాత్రమే ఆడేదని, ఈ ఊరు నుంచి కబడ్డీ క్రీడాకారులు పోలీసులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు మడక కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్‌లు కేడం లింగమూర్తి, బత్తిని సాయిలు, ఎంపీటీసీ భొమ్మగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం అందజేస్తా..

హుస్నాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ హుస్నాబాద్, కరీంనగర్ రెనే ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని సీవీ రామన్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో మంత్రి వైద్య పరీక్షలు చేసుకున్నారు. శిబిరంలో ప్రముఖ ఛాతీ వైద్యులు, గుండె సంబంధించిన వైద్యులు, జనరల్ ఫిజీషియన్ వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్లు, వైకుంఠ రథాలు పెట్టుకోవడానికి వసతి కోసం కలెక్టర్, ఆర్డీఓలతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. లయన్స్ క్లబ్‌కు నా తండ్రి జ్ఞాపకార్థం వైకుంఠ రథం విరాళంగా ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అయిలేని అనిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, లయన్స్ క్లబ్ నిర్వాహకులు రాజగోపాల్‌రావు, కాయిత నారాయణ రెడ్డి, చిట్టి గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రిని సన్మానించిన ఆర్టీసీ ఉద్యోగులు

హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్టీసీ ఉద్యోగులు శాలువా కప్పి సన్మానించారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2017 సంవత్సరానికి సంబంధించి వేతన సవరణ 21 శాతం ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


పతకాలతో విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు రెంజుకీ షాటోకాన్ వ్యవస్థాపకుడు కరాటే మాస్టర్ నగేశ్ తెలిపారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని శ్రీ శుభం ఫంక్షన్ హాల్‌లో సన్ షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో రెండవ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవాతోపాటు సుమారు 10 రాష్ట్రాల నుంచి 1500 మంది విద్యార్థులు పాల్గొనగా మెదక్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన వారిని మైనంపల్లి హన్మంతరావు అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు బ్యానర్ కలకలం

పరిశ్రమ తీసుకున్న భూములు తిరిగి అప్పగించాలంటూ హెచ్చరిక


మాసాన్‌పల్లిలో వెలిసిన బ్యానర్

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో హెటిరో డ్రగ్స్ కంపెనీ భూములు తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మావోయిస్టుల పేరుతో హెచ్చరిస్తూ ఆదివారం బ్యానర్ వెలిసింది. బ్యానర్‌తో పాటు వాల్ రైటింగ్ రాయడం మండలంలో కలకలం సృష్టిస్తోంది. తొగుట, కొండపాక మండలాల పేద రైతుల నుంచి అక్రమంగా సేకరించిన భూమిలో కంపెనీలు నిర్మిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. పెట్టుబడి దారుల కొమ్ముకాస్తే ఎంతటి వారైనా ప్రజాకోర్టులో శిక్షార్హులేనని హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లి రైతుల నుంచి 260 ఎకరాలు, కొండపాక మండలం సర్సినగండ్ల గ్రామ రైతుల నుంచి సుమారు 40 ఎకరాలు హెటిరో డ్రగ్స్ పరిశ్రమ యాజమాన్యం కొన్నేళ్ల కిందట కొనుగోలు చేసింది. గ్రామాల మధ్యన రసాయన పరిశ్రమ నిర్మిస్తే కాలుష్యంతో తాము జీవించే పరిస్థితి ఉండదని అప్పట్లోనే అధికారులు సమావేశాల్లో గ్రామస్తులు తిరగబడ్డారు. దీంతో అధికారులు ఈ విషయాన్ని వదిలేశారు. ఇన్నాళ్ల తర్వాత హెటిరో పరిశ్రమ యాజమాన్యం భూమి చుట్టూ పెన్సింగ్ నిర్మాణం చేపట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరుతో వాల్ రైటింగ్, బ్యానర్ వేయడంతో మావోయిస్టులేనా లేక నకిలీలపనేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

తల్లి మందలించిందని..

క్షణికావేశంతో కూతురు ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): తల్లి మందలించడంతో కూతురు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్గల్ మండలం సామలపల్లిలో ఆదివారం వెలుగుచూసింది. బేగంపేట ఎస్సై రవికాంత్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం సామలపల్లికి చెందిన చిగుళ్ల నర్సింలు–జయమ్మ దంపతులు తమ కూతురు నవనీత(20)ను ఏడాదిన్నర కిందట మర్పడగ గ్రామానికి చెందిన బోడపట్ల యాదగిరితో వివాహం జరిపించారు. వివాహం అనంతరం కూతురు తరచూ పుట్టింటికి వస్తుండడంతో తల్లిదండ్రులు పలుమార్లు మందలించారు. శనివారం మరోసారి కూతురు పుట్టింటికి రావడంతో వివాహం జరిగిన తర్వాత భర్త వద్ద ఉండాలని, ఎందుకొచ్చావని తల్లి జయమ్మ మందలించింది. తర్వాత జయమ్మ భర్త నర్సింలు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో లక్ష్మక్కపల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లింది. వారు వెళ్లిన అనంతరం నవనీత జీవితంపై విరక్తితో తల్లిగారి ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలం గుండా పారే మోయతుమ్మెద వాగులో ఖాత వద్ద ఆదివారం రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి శివరాత్రి తిరుపతి, సిరిగిరి సుధాకర్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- ఐదేళ్ల చిన్నారితోపాటు తాత, తల్లికి గాయాలు
- కోడి గుడ్లు ఉడకపెడుతుండగా ప్రమాదం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కీర్తి


చెల్లాచెదురుగా ఇంట్లో సామగ్రి

జహీరాబాద్ టౌన్: గ్యాస్ సిలిండర్ పేలి చిన్నారితో పాటు తాత, తల్లికి గాయాలైన ఘటన ఆదివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మాణిక్‌ప్రభు వీధిలో నివాసం ఉంటున్న ఎరుకలి లక్ష్మన్న(70)కు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఒకే ఇంటిలోనే కొడుకులు, లక్ష్మన్న వేర్వేరుగా ఉంటున్నారు. పెద్ద కొడుకు కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయల జాతరకు వెళ్లగా చిన్న కుమారుడు సెంట్రింగ్ పని కోసం వెళ్లాడు. లక్ష్మన్న భార్య పని మీద బయటకు వెళ్లింది. అయితే లక్ష్మన్న కోడి గుడ్లు ఉడికించడానికి గ్యాస్ అంటించగా ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. సిలిండర్ పేలి పెద్ద శబ్దం వచ్చింది. శబ్దం విన్న చిన్న కొడుకు కూతురు కీర్తి(5) తాత వద్దకు వెళ్లింది. తాతను కాపాడేందుకు ప్రయత్నించిన మనుమరాలి డ్రెస్‌కు మంటలు అంటుకున్నాయి. కీర్తి పెద్దగా కేకలు వేయడంతో తల్లి సుగుణమ్మ(26) పరుగెత్తుకొని వచ్చి మంటలు ఆర్పడానికి ప్రయత్నించింది. దీంతో ఆమె కాళ్లకు, చేతులకు గాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో లక్ష్మన్న, కీర్తిలకు తీవ్ర గాయాలైయ్యాయి. బీఆర్ఎస్ నాయకులు బరూర్ దత్తాత్రి స్పందించి గాయపడిన ముగ్గురిని వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మన్న, కీర్తిలకు తీవ్రంగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యూజ్ వైర్ సరి చేస్తుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి


గణేశ్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బీ కొండాపూర్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామానికి చెందిన బోయిని గణేశ్ (46) బీ కొండాపూర్ శివారులోని వ్యవసాయ పొలంకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ లోపంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫ్యూజ్‌వైర్ సరి చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన సమీప రైతులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న ఎస్ఐ బాలరాజు పంచనామ నిర్వహించి మృతుడి భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..


ఆధారాల సేకరణలో క్లూస్ టీం

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా వరుస చోరీలు జరుగుతున్న ఘటన మండలంలో చిన్నఘనపూర్ గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డె ఎల్లయ్య ఇంటిలో ఇటీవలె పెళ్లయింది. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఏడుపాయల జాతరకు వెళ్లారు. దొంగలు తాళాలు పగులగొట్టి తులం బంగారం, కిలో వెండి ఆభరణాలతోపాటు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, బట్టిగారి బూదమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి రూ.30 వేల నగదు, అర తులం బంగారు కమ్మలు, వెండి గొలుసులు చోరీ చేశారు. అలాగే, కమ్మరి విమలమ్మ ఇంట్లోని రూ.5 వేల నగదు అపహరించారు. ఈ ఘటనల విషయం తెలుసుకున్న కొల్చారం పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాయపోలు(దుబ్బాక): పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ ఘటన రాయపోలు మండలం కృష్ణసాగర్‌లో చోటు చేసుకుంది. రాయపోలు ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణసాగర్ గ్రామానికి చెందిన కొప్పుల సుశీల(55) కిడ్నీలు దెబ్బతినడంతో తరచుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఇటీవలె కిందపడడంతో కాలు విరిగింది. దీంతో మనోవేదనకు గురైన సుశీల ఈ నెల 7వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు కుటుం సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి సుశీలను చికిత్స నిమిత్తం గజ్వేల్‌కు తీసుకెళ్లారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న సుశీల శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం రేబర్తి–లక్కపల్లి గ్రామాల మధ్య పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కొంతమంది వ్యక్తులు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో వెళ్లి దాడులు చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద రూ.5,880, ఏడు సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్యారెట్.. లాభాలకు రూటు

ఆరుతడి సాగుకు అనుకూలం

- కొద్దిపాటి శ్రమ, సాగుతో ఆర్థికాదాయం
- మార్కెట్‌లో మంచి డిమాండ్
- రైతులు సలహాలు, సూచనలు పాటించాలి


క్యారెట్ సాగు


అనీల్ కుమార్, హార్టీ కల్చర్ అధికారి

మిరుదొడ్డి(దుబ్బాక): వేరు కూరగాయల్లో క్యారెట్ ముఖ్యమైంది. నీటి వసతి కలిగి ఉంటే చాలు క్యారెట్ సాగు చాలా అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా క్యారెట్‌ను పచ్చిగా తినడం వల్ల రేచీకటి, గుండెపోటును నివారిస్తుందని డాక్టర్లు సైతం భరోసా ఇస్తున్నారు. అనేక వంటకాలతోపాటు సలాడ్లలోనూ క్యారెట్‌ను విరివిగా వినియోగిస్తారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతుండటంతో రైతులు క్యారెట్ సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. కొద్దిపాటి శ్రమతో, తక్కువ పెట్టుబడితో మంచి ఆర్థికాదాయం సాధించవచ్చని హార్టీ కల్చర్ అధికారి అనీల్ కుమార్ తెలిపారు. క్యారెట్ సాగు విధానంపై ఆయన తెలిపిన సలహాలు, సూచనలు..

నేలలు

- నీటి వసతి కలిగిన లోతైన గరప నేలలు అనుకూలంగా ఉంటాయి. క్యారెట్‌లో చాన్‌టెనీ, పూసాకేసర్, ఎర్లీ నాంటిస్ అనే రకాలు ఉన్నాయి. ఎకరానికి 2 కిలోల విత్తనాలు సరిపోతాయి. మొక్కను 30 ఇన్ టూ 5 సెంటీ మీటర్ల దూరంలో నాటుకోవాలి.

ఎరువులు వేసుకునే విధానం

- ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుని వేసుకొని మెత్తగా కలియ దున్నుకోవాలి.
- ఎకరానికి 20:16:20 కిలోల చొప్పున నత్రజని, భాస్వరం, పోటాష్‌లను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- నత్రజనిని రెండు దఫాలుగా వేయాలి. మొదటి సగం ఆఖరి దుక్కిలో, రెండవ భాగం విత్తిన ఆరు వారాల తర్వాత వేసుకోవాలి.

నీటి తడులు

- వారం, పది రోజులకొకసారి వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడిని అందించాలి.
- ఎప్పటికప్పుడూ కలుపు మొక్కలను తొలగించుకోవాలి.

సస్య రక్షణ చర్యలు

- ఆకులు తినే పురుగులు, ఆకుమచ్చ, మాడు తెగులు, బూడిద తెలుగు సోకి పంటకు నష్టాన్ని కలిగిస్తాయి.
- గొంగళి పురుగులు ఆకులను కొరికి తినడంతో ఆకులపై చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడతాయి.
- ఆకుమచ్చ పురుగుల వల్ల ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండిపోతాయి.
- మాడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి పండు బారి ఎండిపోతాయి.
- బూడిద తెగులు వల్ల ఆకులపై, కింది భాగాలల్లో బూడిద వంటి ద్రవం ఏర్పడుతుంది. తద్వారా ఆకులు పండిపోయి ఎండిపోతాయి.

నివారణ చర్యలు

- క్యారెట్ సాగును ఆశించే ఆకుమచ్చ, మాడు తెగులు, బూడిద తెగులు, ఆకు తినే పురుగుల నివారణకు మలాథియాన్ 2 మి. లీటర్లను వెటబుల్ సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి విత్తిన 4 నుంచి 7 వారాల వ్యవధిలో పిచికారీ చేయాలి. 90 రోజుల్లోనే పంట చేతికొస్తుంది. ఎకరానికి 8 టన్నుల క్యారెట్ దుంపల దిగుబడి వస్తుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-7998 51]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.